జేఏసీ చైర్మన్ దంపతులకు పీహెచ్‌డీ పట్టా



పట్టాతో జేఏసీ చైర్మన్ బొట్ల బిక్షపతి, సంధ్య

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీలో 13వ స్నాతకోత్సవంలో మంగళవారం తెలంగాణ ఉద్యమకారులు, జేఎన్‌టీయూహెచ్ జేఏసీ చైర్మన్ బొట్ల బిక్షపతి పీహెచ్‌డీ డిగ్రీ పట్టా పొందారు. ఆయనతో పాటు తన సహచరి సందెల సంధ్య కూడా పీహెచ్‌డీ పట్టా పొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒకేసారి ఒకే వేదికపై పీహెచ్‌డీ పట్టాలు పొందటం ఆనందంగా ఉందన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా బస్తీలలో పాదయాత్ర చేస్తున్నామని కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ అన్నారు. మంగళవారం హస్మత్‌పేట్ దుబాయిగేట్ వైష్ణవి మాతా ఆలయం ఎదురుగా ఉన్న బస్తీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తక్షణమే అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ అధికారులతో మాట్లాడి పలు సమస్యలు పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో ఏఈ ఆశ, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, వాటర్ వర్క్స్ మేనేజర్ తేజ, లక్ష్మణ్ యాదవ్, కృష్ణ, నవీన్ రెడ్డి నాయకులు మేకల హరినాథ్, దామోదర్ వర్మ, అశోక్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి రోడ్ల నిర్మాణాలు పూర్తి చేస్తాం

- పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



కాలనీలో పర్యటిస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్ శ్రీనివాసరావు, అధికారులు

ఆల్విన్‌కాలనీ: డివిజన్‌లో అసంపూర్తి రోడ్డు నిర్మాణాలను పూర్తి చేస్తామని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జలవాయు విహార్, హెచ్ఎంటీ హిల్స్ కాలనీలో కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, ఇంజినీరింగ్, జలమండలి, ఇరిగేషన్ అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తామని తెలిపారు. అన్ని రకాల మౌలిక వసతులు కల్పించామని వివరించారు. అన్ని రోడ్లను దశల వారీగా చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామని, పొంగుతున్న మ్యాన్‌హోల్‌ల వద్ద పునరుద్ధరణ చేస్తామన్నారు. ఎల్లవేళలా అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అధికారులు ఇరిగేషన్ ఏఈ లక్ష్మీ నారాయణ, జలమండలి మేనేజర్ ప్రియాంక, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి



సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, ఏఈ శ్రావణి

ఆల్విన్‌కాలనీ: సీసీ రోడ్డు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్‌లో రూ.15 లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఏఈ శ్రావణితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డును లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిల్వకుండా, భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా నిర్మాణం చేపట్టాలన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, మారెళ్ల శ్రీనివాసరావు, రవి, పోశెట్టి గౌడ్, షౌకత్‌అలీ మున్నా, ముజీబ్, సంగమేష్, అగ్రవాసు, మోజెస్, ఫారూఖ్, ఖలీమ్, రాజుగౌడ్, గౌస్, శ్రీను, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వేడుకలు

- పూజలు నిర్వహించిన ఎంపీ ఈటల రాజేందర్



పూజల అనంతరం ఎంపీని సన్మానిస్తున్న ఆలయ కమిటీ

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధి వివేకానంద నగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలో శ్రీభూనీల సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ 13వ వార్షిక వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. బుధవారం కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, వివేకానందనగర్ కాలనీ అధ్యక్షులు బొల్లు శ్రీనివాసరావు, తులసినగర్ అధ్యక్షులు అంకిత్‌సింగ్, గాయత్రినగర్ అధ్యక్షుడు కృష్ణారావు, యాదవరెడ్డి, కలవల ఏడుకొండలు, శ్రీనివాస్, ప్రసన్నాంజనేయులు, జెల్లా రవి, మోహన్‌రావు, గాంధీ పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగనగర్‌లోని దేవదాయ ధర్మాదాయ శాఖ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. మొత్తం హుండీ ఆదాయం రూ.3.10 లక్షలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారి గుమ్మడిదల సుధాకర్ తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ సికింద్రాబాద్ ఏరియా ఇన్‌స్పెక్టర్ డి. మధుబాబు పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగింది. కార్యక్రమంలో ఆలయ పాలక కమిటీ చైర్మన్ బాకారం బుచ్చయ్య, సభ్యులు దూడల జనార్ధన్ గౌడ్, నరసింహ, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



సమస్యను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: శ్రీరామ్‌నగర్ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ అన్నారు. మంగళవారం శ్రీరామ్‌నగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శంషీగూడకు వెళ్లే బ్రిడ్జి వద్ద నిలిచి ఉన్న డ్రైనేజీ నీరు, మంజీరా పైపులైన్ నీటి సమస్యను పరిష్కరించాలన్నారు. డ్రైనేజీ మురుగు రోడ్లపై ప్రవహిస్తుండటంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వేణుగోపాల్ యాదవ్, బాబు కృష్ణ నర్సింగ్, రాజు, అంబాదాస్, సిద్ధి, నర్సింగ్, సైదమ్మ, కరుణాకర్, బాలకృష్ణ, వెంకట్, రాహుల్, రవి, లక్ష్మి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్ కాలనీలో నివసించే షరీఫ్ బీ అనారోగ్యంతో మరణించింది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ తనయుడు దొడ్ల రామకృష్ణగౌడ్ బాధిత కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఫారూఖ్, ఖాజా, మహబూబ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

వంద పడకల ఆసుపత్రి నిర్మించాలి



ఆసుపత్రి నిర్మించాలని నిరసన వ్యక్తం చేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు, నాయకులు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ కాలనీలోని 5వ ఫేజ్‌లో వెంటనే 100 పడకల ఆసుపత్రి నిర్మించాలని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆసుపత్రికి కేటాయించిన స్థలం వద్ద స్థానికులతో కలిసి మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ డివిజన్ స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసనలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రెండు సంవత్సరాల క్రితం మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే కృష్ణారావు చేతుల మీదుగా ఆసుపత్రి నిర్మాణానికి కృషి చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆసుపత్రి నిర్మించకపోగా.. ఫౌండేషన్ రాయిని తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఉపయోగపడే ఆసుపత్రి నిర్మించాలన్న జ్ఞానం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదన్నారు. అదేవిధంగా 3వ ఫేజ్‌లో రమ్యా గ్రౌండ్ వద్ద తన సొంత నిధులతో ప్రభుత్వ స్కూల్ నిర్మిస్తానని ముందుకు రావడంతో అప్పటి మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేతుల మీదుగా స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. అయినప్పటికీ హౌసింగ్ బోర్డు నుంచి జిల్లా విద్యాశాఖ అధికారులు భూమిని స్వాధీనం చేసుకోవడంతో పనులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత హౌసింగ్ బోర్డు పరిధిలో ప్రభుత్వ స్కూల్, ఆసుపత్రి నిర్మాణం నిలిచిపోవడం సిగ్గు చేటన్నారు. ఎమ్మెల్యేతో కలిసి కలెక్టర్‌కు విన్నవించినా అడుగు ముందుకు పడలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు స్పందించి ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించాలని కోరారు. స్పందించకుంటే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జనగాం సురేష్ రెడ్డి, వెంకటరెడ్డి, భవాని, కన్నెలత, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు ఎల్లవేళలా సహకారం

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే కృష్ణారావు, సీనియర్ సిటిజన్స్

కేపీహెచ్‌బీకాలనీ: సీనియర్ సిటిజన్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం కేపీహెచ్‌బీ కాలనీ మూడో ఫేజ్‌లోని సీనియర్ సిటిజన్ భవనంలో జరిగిన ఆత్మీయ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సీనియర్ సిటిజన్స్ భవన విస్తరణకు, అక్కడి ఖాళీ స్థలాన్ని వినియోగించుకునేందుకు నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ.45 లక్షలు కేటాయించి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇంజినీరింగ్ విభాగం అధికారులు పనులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో సీనియర్ సిటిజన్స్ హర్షం వ్యక్తం చేశారు.